సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం ; 15 ; డిసెంబర్ ; 2023



ఆకట్టుకున్న ప్రదర్శన

పలాసలో సభా ప్రాంగణం వద్ద కిడ్నీ ఆస్పత్రి, వైఎస్సార్ సుజల ధారతో పాటు సీఎం వైఎస్ జగన్ చిత్రంతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది.

విద్యార్థితో సెల్ఫీ



కాశీబుగ్గ: సీఎంతో సెల్ఫీ దిగాలని ఆశ పడిన ఓ చిన్నారి విన్నపాన్ని సీఎం వైఎస్ జగన్ మన్నించారు. పలాసకు చెందిన టి.దిలీప్ బారికేడ్లు ఎక్కి సెల్ఫీ అడుగుతుండగా.. సీఎం గమనించి ఆత్మీయంగా సెల్ఫీ దిగారు.

మూలపేట పోర్టు పరిశీలన



టెక్కలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏరియల్ వ్యూ ద్వారా సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు పనులను పరిశీలించారు. పలాస సభ తర్వాత హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణంలో పోర్టు పనులను పరిశీలించారు.

న్యూస్‌రీల్

సీఎం పర్యటన విజయవంతమైంది

నరసన్నపేట, కాశీబుగ్గ: జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఉద్దానం ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం ఈ నాటికి ముఖ్యమంత్రి సాకారం చేశారని అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అలాగే సీదిరి అప్పలరాజు కూడా సీఎం సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఓ ప్రకటన విడుదల చేశారు.

మానవత్వం..



మోహనరావుకు సాయం చేస్తున్న పోలీసు

వజ్రపుకొత్తూరు రూరల్: సీఎం వైఎస్ జగన్‌ను కలిసేందుకు వచ్చిన ఓ బాధితుడికి పోలీసులు ధైర్యం చెప్పారు. ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సోంపేట గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ కదంబాల మోహన్‌రావు సీఎంను కలిసేందుకు వచ్చారు. జనం మధ్య దూరంగా ఉండిపోయిన ఆయనను పోలీసులు ఎత్తుకువచ్చి ముందు వరసలో ఉంచారు. అంతలోనే సీఎం ఆయనను చూసి స్పందించి సిబ్బందికి చెప్పడంతో వారు మోహనరావును కాన్వాయ్‌లోకి ఎత్తుకుని తీసుకెళ్లారు.

సేవా తత్వం..



తలసేమియా బాధిత చిన్నారులతో తల్లి బుద్దాల స్వాతి

కంచిలి, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం రూరల్: కంచిలి మండలం మకరాంపురంలో డాక్టర్ వైఎస్సార్ సుజలధార పథకాన్ని ప్రారంభించేందుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్ నిస్సహాయ కుటుంబానికి భరోసా ఇచ్చారు. సీఎం రాక సందర్భంగా.. కవిటి మండలం గొర్లెపాడు పంచాయతీ పరిధి భాజురు గ్రామానికి చెందిన బుద్దాల స్వాతి తన కవల పిల్లలను ఆయనను చూపించేందుకు వచ్చారు. రెండేళ్ల వయసున్న ఈ పిల్లలు తలసేమియా వ్యాధితో బాధ పడుతున్నారు. సీఎం వైఎస్ జగన్ వీరిని చూసి మాట్లాడారు. ప్రతి నెలా పిల్లలకు రక్త మార్పిడి చేయాల్సి ఉంటుందని, మీరే ఆదుకోవాలని ఆ తల్లి కోరగా వెంటనే కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో సీఎం మాట్లాడి సాయం చేసేందుకుఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

అదనపు పరిహారం

ఎల్.ఎన్.పేట: వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారం కోసం రూ.43 కోట్ల నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేశారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం, ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా సీఎంను ఆమె గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వంశధార నిర్వాసితుల అదనపు పరిహారం అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అక్కడే ఉన్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో సీఎం వైఎస్ జగన్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అదనపు పరిహారం కోసం రూ.43 కోట్లు వెంటనే విడుదల చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు.

మాట నిలబెట్టుకున్నారు..



వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు కిడ్నీ బాధితులను శాశ్వత ప్రాతిపదికన ఆదుకుంటామని మా స్వగ్రామం జగతిలోనే మాటిచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ మాటను నిలబెట్టుకున్నారు. మా ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ వ్యాధిని రూపుమాపడానికి దేవుడిలా వచ్చారు. నేను సర్పంచ్‌గా ఉండగా ఆయన ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం గర్వంగా ఉంది.

– పూడి వరప్రసాద్, సర్పంచ్, కవిటి



వేదికపై డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, విడదల రజిని, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతి, వి.కళావతి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి తదితరులు



అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

మాట గెలిచింది.. గుండె తట్టింది

- సీఎం వైఎస్ జగన్ చేతులమీదుగా కిడ్నీ ఆస్పత్రి, వైఎస్సార్ సుజలధార ప్రారంభం
- పలాసలో ఇండస్ట్రియల్ కారిడార్‌కు శంకుస్థాపన
- బీఆర్ఏయూలో హాస్టల్ ప్రారంభోత్సవం
- తిరునాళ్లను తలపించిన సభా ప్రాంగణం
- పలాస–కాశీబుగ్గలో జనజాతర
- సీఎం ప్రసంగానికి జనం ఫిదా

వంశధార నీరు ఉద్దానం గొంతు తడిపితే.. సీఎం వైఎస్ జగన్ ప్రేమ జనం గుండెను తడిమింది. ఊళ్లకు ఊళ్లను చావుకు వదిలేసిన నాయకులను చూసిన కళ్లకు జగనన్న మాట ఆశీర్వాదంలా అనిపించింది. మాటిచ్చిన చోట సగర్వంగా చేసిన ప్రారంభోత్సవం జనాలను అబ్బురపరిచింది. నేను మీ బిడ్డనంటూ సవినయంగా సాగిన ప్రసంగం వారి మనసులు గెలిచింది. జనసంద్రంలా కనిపించిన బహిరంగ సభ వైఎస్ జగన్ బలాన్ని బలగాన్ని మరోమారు ప్రపంచానికి పరిచయం చేసింది. దారి పొడవునా ముఖ్యమంత్రి కాన్వాయ్‌పై కురిసిన పూలవాన జనాలకు జగన్‌కు మధ్య ఉన్న అనుబంధానికి రుజువులా కనిపించింది.



సభకు హాజరైన జన సందోహంలో ఓ భాగం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాకతో పలాస తిరునాళ్లను తలపించింది. తమ ఆకాంక్షలను నెరవేర్చిన ముఖ్యమంత్రి కోసం ఉద్దానంలో ప్రతి అడుగు పలాస వైపు పరుగులు తీసింది. పల్లెలన్నీ తరలి రావడంతో పలాస–కాశీబుగ్గ జనజాతరను తలపించింది. అంతకుముందు కంచిలి మండలం మకరాంపురం జనప్రవా హంలా మారింది. ఊహకందని విధంగా సుదూర ప్రాంతం నుంచి తీసుకొస్తున్న మంచినీటి పథకం కళ్లముందు ప్రారంభం అవుతున్న దృశ్యం చూసి మురిసిపోయింది. ఆనాడు ప్రతిపక్ష హోదాలో తమకు ఇచ్చిన మాటకు కట్టుబడి తమ చిరకాల కలను నెరవేర్చిన జగన్ మోహన్ రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దారి పొడవునా కేరింతలు, హర్షధ్వానాల మధ్య వైఎస్ జగన్ కాన్వాయ్ సాగింది. చిన్నపిల్లల నుంచి అవ్వాతాతల వరకు మండుటెండను సైతం లెక్క చేయకుండా అభిమాన నాయకుడిని చూసేందుకు ఉవ్విళ్లూరారు. ఉప్పెనలా తరలివచ్చిన జనంతో సభ ప్రాంగణం నిండిపోవడంతో బయట కూడా వేలాదిగా నిరీక్షించి సీఎం జగన్ ప్రసంగాన్ని విన్నారు. ఉద్దాన ప్రాంతంలో గతంలో ఏ నాయకుడికి లేనంత ప్రజాదరణ నేడు జగన్ మోహన్ రెడ్డికి రావడంతో రానున్న ఎన్నికల్లో జగన్ గెలుపు ఏకపక్షమే అని ఈ ప్రాంత వాసులు అభిప్రాయ పడ్డారు.

పర్యటన సాగిందిలా..

గురువారం ఉదయం 10.30 ప్రాంతంలో హెలికాప్టర్‌లో సీఎం వైఎస్ జగన్ కంచిలి మండలం మకరాంపురం గ్రామానికి చేరుకున్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. అప్పటికే వేలాదిగా ప్రజలు అక్కడకు తరలివచ్చారు. దీంతో హెలీప్యాడ్ ప్రాంగణంతో పాటు మకరాంపురం వరకు వెళ్లే కాన్వాయ్ మార్గమంతా బారులు తీరిన జనంతో కిటకిటలాడింది. వారందరికీ అభివాదం చేసుకుని మకరాంపురానికి చేరుకున్నారు. అశేష జనవాహిని మధ్య ఉదయం 10.46 సమయంలో మకరాంపురంలోని వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పథకం పని తీరును, ప్రయోజనాలు, లక్ష్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 10.55 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభోత్సవం చేసి జాతికి అంకితం చేశారు. తాగునీటి జలాల ప్రవాహాన్ని దగ్గరుండి చూశారు.



కిడ్నీ ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌తో ప్రజా ప్రతినిధులు

అక్కడి నుంచి ఉదయం 11.30 గంటలకు హెలికాప్టర్‌లో కిడ్నీ రీసెర్చ్, 200పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభోత్సవం కోసం పలాస చేరుకున్నారు. బస్సులో ప్రయాణించి, దారి పొడవునా బారులు తీరిన జనానికి అభివాదం చేసుకుని 11.50 గంటలకు రీసెర్చ్ హాస్పిటల్‌కు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మధ్యాహ్నం 12.08 గంటలకు ఆసుపత్రిని ప్రారంభించారు. అనంతరం నాలుగు అంతస్తుల్లో ఉన్న వివిధ వార్డులను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన అధునాతన పరికరాలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడి వైద్య సేవల కోసం తెలుసుకున్నారు. అనంతరం డయాలసిస్ చేసుకుంటున్న రోగులను పరామర్శించి, వారి యోగక్షేమాలు, బాధ లను తెలుసుకుని నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. అక్కడి నుంచి బస్సులో ప్రయాణించి బహిరంగ సభ వేదిక వద్దకు అశేష జనవాహిని మధ్య చేరుకున్నారు. మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో వేదిక వద్దకు చేరుకుని రామకృష్ణాపురం ఏర్పాటు చేయబోతున్న నూతన పారిశ్రామిక వాడకు శంకుస్థాపన చేశారు. అనంతరం అంబేడ్కర్ యూనివర్సిటీ హాస్టల్ భవనాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. సుదీర్ఘ ప్రసంగం తర్వాత హెలిప్యాడ్ వద్దకు బయలుదేరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో ముచ్చటించారు. మొత్తానికి కిడ్నీ సమస్యల నుంచి బయటపడేందుకు విశేషంగా కృషి చేసిన సీఎం జగన్ రాకతో ఉద్దాన ప్రాంతంలో ముందుగానే పండగ వాతావరణం సంతరించుకుంది.



సైడ్‌లైట్స్

- బహిరంగ సభలో బీఆర్ఏయూ విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వర్సిటీలో హాస్టల్ భవనాన్ని ప్రారంభించడంతో ఆనందంతో కేరింతలు కొట్టారు.
- పలాస పాత జాతీయ రహదారి పొడవునా సీఎం కాన్వాయ్‌పై మహిళలు పూల వాన కురిపించారు.
- ముఖ్యమంత్రి సభలో గిరిజన బాలికలు చేసిన థింసా నృత్యం ఆకట్టుకుంది.
- కార్యక్రమానికి దాదాపు రెండువేల మంది ఆదివాసీలు హాజరు కావడం అందరి దృష్టిని ఆకట్టుకుంది.
- సభా ప్రాంగణం వద్ద ప్రహరీలు, చెట్లు, భవనాలపైకి ఎక్కి జనం సీఎం వైఎస్ జగన్ ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు.

ఆకట్టుకున్న జగన్ ప్రసంగం

మాటలతో మాయ చేసే ప్రభుత్వం మాది కాదని, చెప్పిన మాట మేరకు చేతల్లో చూపించిన ప్రభుత్వం మాది అని జగన్ చెప్పడంతో జనం చప్పట్లతో మార్మోగించారు. ఇదే మీ బిడ్డ జగన్ కమిట్‌మెంట్ అని మనసున్న నా యకుడెవరో ఎవరు మంచి చేశారో ఆలోచించుకోవాలని అన్నప్పుడు సభా ప్రాంగణమంతా హోరెత్తిపోయింది. చంద్రబాబుకు మానవత్వం లేదని ప్రజల ప్రాణాలంటే లెక్క లేదని సొంత నియోజకవర్గం కుప్పంకే నీరివ్వని చంద్రబాబుకు ఈ ప్రాంతంపై ఏం మమకారం ఉంటుందని ప్రశ్నించే సరికి స్పందన దద్దరిల్లిపోయింది. నాడు జరిగిన అన్యాయం, చేసిన మోసాలకు కళ్లకు కట్టినట్టుగా చెప్పడం, నేడు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమంపై అంకెలతో సహా చెప్పడంతో జనమంతా ఆసక్తిగా విన్నారు.

కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జిల్లా పరిషత్ చైర్మన్లు పిరియా విజయ, మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, వరుదు కళ్యాణి, నర్తు రామారావు, దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, కంబాల జోగులు, విశ్వాసరాయి కళావతి, టెక్కలి, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయ కర్తలు దువ్వాడ వాణి, పిరియా సాయిరాజ్, హెల్త్ సెక్రటరీ కృష్ణబాబు, ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, ఏపీ ఎండీసీ ఎండీ మురళీ కృష్ణ, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, డీఐజీ హరికృష్ణ, ఎస్పీ జీఆర్ రాధిక, జేసీ నవీన్‌కుమార్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కార్పొరేషన్ చైర్మన్లు అందవరపు సూరిబాబు, పేరాడ తిలక్, దుక్క లోకేశ్వర రెడ్డి, పి.కృష్ణవేణి, సీరపు రాణి, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, పలాస నియోజకవర్గ పార్టీ పరిశీలకులు సూర్యనారాయణరాజు, పలాస మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, జిల్లా గ్రంథాలయ అధ్యక్షులు సువ్వారి సువర్ణ, డాక్టర్ దానేటి శ్రీధర్, యువనేతలు ధర్మాన కృష్ణచైతన్య, రామ్‌మనోహర్ నాయుడు, చిరంజీవి నాగ్, పార్టీ నాయకులు పాలిన శ్రీనివాసరావు, చింతాడ రవికుమార్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, పలాస ఎంపీపీ ఉంగ ప్రవీణ, వజ్రపుకొత్తూరు ఎంపీపీ యు.నీలవేణి, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య పాల్గొన్నారు.

పలాసపై వరాల జల్లు

పలాసపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వరాల జల్లు కురిపించారు. స్థానికంగా చేయాల్సిన పలు పనులపై మంత్రి సీదిరి అప్పలరాజు విన్నవించగా సీఎం వెంటనే మంజూరు చేశారు. ఆ పనులివే..

- పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి కేటీ రోడ్డు విస్తరణ, అదనపు పనులకు రూ.5కోట్లు.
- మదనగోపాలసాగర జలాశయం నుంచి డీ–టూరింగ్ పనులకు రూ.8.3 కోట్లు.
- బెండి గెడ్డపై ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి బెండి, సీతాపురం, పెద్దబొడ్డపాడు, కొండవూరు, పల్లివూరు తదితర 12 గ్రామాల్లో దాదాపు 1200 ఎకరాలను సస్యశ్యామలం చేసేందుకు రూ.7.3 కోట్లు.
- మూలపేట పోర్టు కనెక్టివిటీ కోసం నౌపాడ–వెంకటాపురం డబుల్ లేన్ రహదారి నిర్మించేందుకు రూ.60 కోట్లు.

మా దేవుడు మీరే..!



ఏదైనా మనం ఒక పని మొదలుపెట్టేటప్పుడు ముందు దేవుణ్ని మొక్కి మొదలుపెడతాం. తర్వాత పని పూర్తయిన తర్వాత అదే దేవుణ్ని మొక్కి కృతజ్ఞతలు తెలుపుకుంటాం. ఈ ప్రాంతంలో వేలాదిమంది ఎందుకు చనిపోతున్నారో తెలియని పరిస్థితులు చూశాం. నేను ఈ ప్రాంత వైద్యుడిగా ప్రత్యక్షంగా చూశాను. ఈ ప్రాంత ప్రజలకు ఆ దేవుడు పంపిన స్వరూపమే మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. మా కష్టాలు, కన్నీళ్లు ఎవరైనా తుడవకపోతారా.. అని ఎదురుచూసిన ప్రాంతం ఇది. వారికి సంజీవనిలా ముఖ్యమంత్రి వచ్చారు. అతిపెద్ద భగీరథ ప్రయత్నం చేశారు. అనేక అడ్డంకులు దాటి పూర్తిచేసిన ముఖ్యమంత్రి సంకల్పానికి సలాం. పలాస అంటే ప్రపంచానికి తెలిసేది ఒకటి జీడిపప్పు, రెండోది కొబ్బరి పంట. ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి మార్గమైన అదనపు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు సైతం శంకుస్థాపన చేసిన మీకు కృతజ్ఞతలు. ఈ రాష్ట్రంలో ఉన్న ఏ గ్రామమైనా తీసుకోండి ఆ గ్రామంలో సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్స్, ఆర్బీకేలు అభివృద్ధిలో భాగం కాదా. నాడు–నేడు అభివృద్ధి కాదా. మూలపేట పోర్టు పూర్తయితే వలసలు ఆగి, ఈ జిల్లాకే వలసలు మొదలవుతాయి. రాబోయే దశాబ్దానికి ఈ రాష్ట్రానికి సీఎంగా జగన్ రావాలి.. కావాలి.

– డాక్టర్ సీదిరి అప్పలరాజు, మంత్రి



మూడు ప్రారంభాలు.. ఒక శంకుస్థాపన



డాక్టర్ వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టుతో 7 మండలాల్లోని 809 గ్రామాలకు శుద్ధజలం అందుతుంది. ఆరు లక్షల మంది ప్రజలు లబ్ధి పొందుతారు. కిడ్నీ ఆస్పత్రిలో కిడ్నీ సమస్యలే కాకుండా ఇతర అత్యవసర సేవలు సైతం అందుతాయి. బీఆర్ఏయూలో వసతి గృహాన్ని కూడా సీఎం ప్రారంభించారు. పలాసలో నూతన పారిశ్రామికవాడ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. మౌలిక సదుపాయాలకు రూ.11 కోట్లు కేటాయించారు.

– శ్రీకేష్ బి.లాఠకర్, కలెక్టర్

-కాశీబుగ్గ/ వజ్రపుకొత్తూరు/ వజ్రపుకొత్తూరు రూరల్/ పలాస / మందస



వైఎస్ విగ్రహానికి అంజలి ఘటిస్తూ..



కిడ్నీ ఆస్పత్రి వైద్యులతో సీఎం మాటామంతి



అభిమాన నేతకు అభివాదం



తరలివచ్చిన పల్లె మహిళలు



జగనన్నపై పూలవాన కురిపించేందుకు..

క్లుప్తంగా

నేటి నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలో శుక్రవారం నుంచి ఈ నెల 27 వరకు డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. 62 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.

సంక్రాంతి రచనల పోటీలకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలోని విద్యాసంస్థల్లో చదువుతున్న ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు తెలుగులో రచనల పోటీలకు ఆహ్వానిస్తున్నామని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. కవిత (అభ్యుదయకరమైన స్వేచ్ఛాంశంపై 30 పంక్తులకు మించకుండా), కథ (వ్యథామయ రైతు జీవితం ఇతివృత్తంగా 5పేజీలకు మించకుండా), వ్యాసం (పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం. 2.వ్యవసాయ సంక్షోభం-ప్రకృతి ప్రకోపం- ప్రభుత్వ విధానాలు, 3.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి-ఆటంకాలు- పరిష్కారాలు (ఈ అంశాలలో ఏదో ఒకటి 3 పేజీలకు మించకుండా) విభాగాలలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. రచనలను వాట్సాప్ ద్వారా 9490098811 నంబరుకు పంపించవచ్చన్నారు. జనవరి 10న జరిగే సభలో బహుమతులు అందజేస్తామని తెలిపారు.

స్వర్ణ పతక విజేతలకు అభినందనలు



పల్లవిని అభినందిస్తున్న డైరెక్టర్ బాలాజీ, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) ఎస్ఎంపురం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో పీయూసీ మొదటి సంవత్సరం చదువుతున్న సి.హెచ్.పల్లవి విజయనగరంలో జరిగిన అండర్-17 ఫెన్సింగ్ పోటీల్లో విజేతగా నిలిచి బంగారు పతకం సాధించింది. గుజరాత్‌లో జరగనున్న అండర్-17 జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలో పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అధికారులు గురువారం అభినందించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు రాజు, దిలీప్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు తాడివలస విద్యార్థి



తమ్మినేని ఉదయ్‌కిరణ్

పొందూరు: మండలంలోని తాడివలస ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తమ్మినేని ఉదయ్ కుమార్ రాష్ట్ర స్థాయిలో జరిగే గణిత క్విజ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం బల్ల కంటయ్య, గణితశాస్త్ర ఉపాధ్యాయులు చౌదరి వేణుగోపాల్, పూజారి హరిప్రసన్న తెలిపారు. నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వివిధ మండలాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ఉదయ్‌కిరణ్ టాపర్‌గా నిలిచాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

నేటి నుంచి నైరాలో జాతీయ సదస్సులు



డి.శ్రీనివాస్

శ్రీకాకుళం రూరల్: ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ కళాశాల నైరాలో శుక్ర, శనివారాల్లో జాతీయ సదస్సులు నిర్వహించనున్నట్లు అసోసియేట్ డీన్ డి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆహార భద్రత, సుస్థిరమైన గ్రామీణ జీవనోపాధికి వ్యవసాయ ఆవిష్కరణలు అనే అంశంపై సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉపకులపతి ఆర్.శారద జయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ఆరా



పంటలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర బృందం

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులో ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా ఏటీఎం (ప్రతి నిత్యం పంటల నుంచి ఆదాయం వచ్చే సాగు) పద్ధతిలో సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని రాష్ట్ర బృందం సభ్యులు మానస, విజయలక్ష్మి గురువారం పరిశీలించారు. రైతు సుభాషిణి సాగు చేస్తున్న పంటలతో పాటు హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల్లో పంటలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎంటీ సూర్యనారాయణ, గోవిందరెడ్డి, పద్మావతి పాల్గొన్నారు.

ఆడుదాం.. అదరగొడదాం!



- ఈ నెల 26 నుంచి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడోత్సవాలు
- ఈ నెల 17 వరకు రిజిస్ట్రేషన్ గడువు పెంపు
- ఇప్పటికే జిల్లాలో 1,27,405 మంది యువత పేర్లు నమోదు



కబడ్డీ సాధనలో బాలికల జోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లకు జిల్లా నుంచి విశేష స్పందన లభిస్తోంది. తొలుత ఈ పోటీలను ఈ నెల 15న ప్రారంభించాల్సి ఉన్నా కొన్ని జిల్లాల్లో మిచాంగ్ తుఫాను ప్రభావం కారణంగా క్రీడా మైదానాలు అస్తవ్యస్తంగా తయారు కావడంతో పోటీలను ఈ నెల 26కు వాయిదా వేశారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్లలో శ్రీకాకుళం జిల్లా 10వ స్థానంలో నిలిచింది. 732 సచివాలయాల పరిధిలో ఇప్పటికే 1,27,405 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో పురుషులు 89027 మంది, మహిళలు 33378 మంది ఉన్నారు. క్రీడోత్సవాల తాత్కాలిక వాయిదా నేపథ్యంలో ఈ నెల 17 వరకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ గడువు పెంచింది.



వాలీబాల్ శిక్షణలో క్రీడాకారులు

5 క్రీడాంశాలు.. 5 స్థాయిల్లో..

ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ ఇలా మొత్తం ఐదు క్రీడాంశాల్లో 51 రోజుల పాటు పోటీలు జరుగుతాయి. గ్రామ/వార్డు సచివాలయ స్థాయి నుంచి మండలస్థాయి, నియోజకవర్గస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి వరకూ ఐదు స్థాయిల్లో క్రీడోత్సవాలు నిర్వహించనున్నారు.

అర్హులు వీరే..

- క్రీడాకారులకు 15 ఏళ్లు నిండి ఉండాలి.
- ప్రభుత్వ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అనర్హులు.
- ఒక వ్యక్తి గరిష్టంగా రెండు క్రీడాంశాల్లో మాత్రమే పాల్గొనేందుకు అర్హులు.
- బాల బాలికలకు వేర్వేరుగా టోర్నీని నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.
- స్థానికతను తెలియజేసేందుకు ఆధార్ కార్డు తప్పనిసరి.
- వయసు నిర్ధారణకు పుట్టినతేదీ సర్టిఫికెట్ ఉండాలి.

సద్వినియోగం చేసుకోవాలి..



ఆడుదాం ఆంధ్రా పోటీలను తుఫాను కారణంగా మిగిలిన జిల్లాల్లో మైదానాలు సరిగ్గా లేక కొద్దిరోజుల పాటు ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ నెల 17 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉంది. ఇంకా నమోదు చేసుకోని వారు వెంటనే తమ వివరాలను సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కనీసం వలంటీర్లనైనా సంప్రదించాలి. ఈ నెల 26 నుంచి పోటీలు ఘనంగా ప్రారంభమౌతాయి. – డాక్టర్ కె.శ్రీధర్‌రావు, డీఎస్‌డీఓ

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో జిల్లా నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి పలువురు నాయకులకు అవకాశం కల్పించారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా డోల జగన్, జోన్-1 జోనల్ ఇన్‌చార్జిగా ధర్మాన కృష్ణచైతన్య, క్రిస్టియన్ మైనార్టీ సెల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎ.జాన్, కార్యదర్శిగా జి.వెంకటరమణ, సంయుక్త కార్యదర్శిగా పి.విజయ్‌కుమార్, మైనార్టీ సెల్ జోన్-1 జోనల్ ఇన్‌చార్జిగా మహ్మద్ రఫీ, రైతు విభాగం జోన్-1 జోనల్ ఇన్‌చార్జిగా గొండు రఘురాం నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శిగా బండారు ఎస్.వి.జయప్రతాప్‌కుమార్, రాష్ట్ర వీవర్స్‌వింగ్ కమిటీ ఉపాధ్యక్షులుగా నిమ్మన లీలారాణి, కార్యదర్శిగా ఉయ్యూరు చిట్టిబాబు, సంయుక్త కార్యదర్శిగా మొర్రి శంకరరావులను నియమించారు.

ఆంధ్రా అండర్-19 జట్టుకు సుశాంత్ ఎంపిక



నంబల్ల సుశాంత్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రా అండర్-19 బాలుర టెస్ట్ (నాలుగు రోజుల మ్యాచ్‌లు) క్రికెట్ జట్టుకు జిల్లాకు చెందిన నంబల్ల సుశాంత్ ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నుంచి సుశాంత్‌కు సమాచారం అందింది. అనంతపురంలో ఈ నెల 15 నుంచి జార్ఖండ్‌తో మొదలుకానున్న మ్యాచ్‌లో ఆంధ్రా జట్టులో చేరనున్నాడు. ఈ టోర్నీలో ఇప్పటికే నాలుగు మ్యాచ్‌లు ముగిశాయి. మిగిలిన మ్యాచ్‌ల కోసం సుశాంత్‌ను ఏసీఏ సెలక్షన్ కమిటీ సుశాంత్ ప్రతిభను గుర్తించి తుది జట్టుకు ఎంపికచేశారు.

ఆల్‌రౌండ్ ప్రతిభతో ఆకట్టుకోవడంతో..

ఎడమచేతి వాటం బ్యాట్స్‌మేన్‌గా టాప్ ఆర్డర్ (ఓపెనర్) బ్యాటింగ్‌తోపాటు రైటార్మ్ లెగ్‌స్పిన్ బౌలర్‌గా రాణిస్తూ ఆల్‌రౌండ్ ప్రతిభతో ఆకట్టుకుంటున్నాడు. ఇప్పటికే రాష్ట్రస్థాయి అండర్-12, అండర్-14, అండర్-16 ప్రాబబుల్స్, అండర్-19 స్టేట్ లెవల్ టోర్నీల్లో ప్రాతినిధ్యం వహించాడు. అంతర్ జోనల్ మ్యాచ్‌ల్లో తాజాగా రెండు సెంచరీలు సాధించడంతో మరోసారి అండర్-19 ఆంధ్రా జట్టుకు ఎంపికయ్యాడు. టెక్కలిలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన సుశాంత్ ప్రస్తుతం విశాఖపట్నంలో ఇంటర్మీడియెట్ సెకెండియర్ చదువుతున్నాడు. సుశాంత్ తండ్రి నంబల్ల జగదీష్ రిమ్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా.. తల్లి అర్చన గృహిణి. ఆంధ్రా జట్టుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని సుశాంత్ 'సాక్షి'తో తన సంతోషాన్ని పంచుకున్నాడు.

పీర్లకొండకు పోటెత్తిన యాత్రికులు



యాత్రకు హాజరైన యాత్రికులు, భక్తులు

ఇచ్ఛాపురం: పట్టణంలో ఏటా మార్గశిర గురువారం లో జరిగే పీర్లకొండ యాత్రకు భక్తులు పోటెత్తారు. కులమతాలకు అతీతంగా అధిక సంఖ్యలో యాత్రికులు, భక్తులు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. కొండ ప్రారంభ మెట్టు వద్ద కొబ్బరికాయ కొట్టి ధూపదీప నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కొండపై మొదటి ప్రార్థనామందిరం వద్ద పూజలు చేసిన అనంతరం రెండో ప్రార్థన మందిరం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు.

బండి చక్రానికి చీర చుట్టుకుని..

- రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ భార్యకు తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుజాత

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని అరసవిల్లి మిల్లు జంక్షన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.ఎస్.దొర తెలిపి వివరాల మేరకు.. అమలాపురం టౌన్ సూర్యానగర్ దొమ్మటివారి వీధికి చెందిన గోరింట మృత్యుంజయవర్మ రాజమండ్రి సిటీ ఏఆర్ వింగ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. భార్య సుజాతతో కలిసి ఈనెల 13న విజయనగరం జిల్లా భోగాపురం మండలం సవరవిల్లిలో ఉన్న బంధువుల ఇంటి కార్యక్రమానికి ద్విచక్ర వాహనంపై వచ్చారు. అదే బండిపై గురువారం అరసవిల్లి సూర్యనారాయణస్వామిని దర్శించుకోవడానికి బయలు దేరారు. మిల్లు జంక్షన్ దాటాక సుజాత చీర పైట అంచు బండి చక్రానికి చుట్టుకోవడంతో ఒక్కసారిగా కిందపడింది. ఈ ఘటనలో సుజాత తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆటోలో కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దొర చెప్పారు.

దుకాణాల్లో నకిలీ చిప్స్ ప్యాకెట్లు..!

పాతపట్నం: రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన పాతపట్నంలో ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన నకిలీ రింగ్స్ చిప్స్ ప్యాకెట్‌లు దర్శనమిస్తున్నాయి. ఎక్కువగా స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఉన్న దుకాణాల్లో రాజా రింగ్స్, ట్రాప్స్ పేరిట రింగ్స్ చిప్స్ పశ్చిమ బెంగాల్, ఒడిశా నుంచి ఎక్కువగా వస్తున్నాయి. రెండు, ఐదు రూపాయలకే ప్యాకెట్లు లభ్యమవుతుండటంతో చిన్నారులు అధికంగా కొనుగోలు చేస్తున్నారని, అయితే వీటి వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నకిలీలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



సావిత్రమ్మ (ఫైల్)

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంటకు చెందిన పాలుమూరు సావిత్రమ్మ (61) కాలిన గాయాలతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. వీఆర్వో బలగ రామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సింహాచలం తెలిపారు. నవంబర్ 11వ తేదీన ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీక్ కావడంతో సావిత్రమ్మ తీవ్రంగా గాయపడింది. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా ఉద్యోగులు

శ్రీకాకుళం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులు గురువారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలని 2018లో సమ్మె చేస్తే కేవలం ఒక పేస్కేల్ మాత్రమే మంజూరు చేశారని, సానుకూల అంశాలను పరిష్కరించలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా వెయ్యి మంది గ్రామీణ తపాలా ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నట్లు జీడీఎస్ నాయకులు నందికేశ్వరరావు, మూర్తినాయుడు తదితరులు తెలిపారు. సమ్మెకు ఏన్ఎఫ్‌పీఈ అనుబంధ సంఘాలైన గ్రూప్‌సీ పోస్టుమేన్ అండ్ ఎంటీఎస్ ఉద్యోగులు మద్దతు తెలియజేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు రామకోటేశ్వరరావు, అప్పారావు, గురన్న, ప్రకాశరావు, తేనేశ్వరరావు, గణపతి, సురేష్, సూరిబాబు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు



కూరగాయల మొక్కలు నాటుతున్న సిబ్బంది

ఎల్.ఎన్.పేట: ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులు అవలంబిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఎల్.ఎన్.పేట మండలం ప్రకృతి వ్యవసాయం మెంటార్ మెండ పద్మావతి అన్నారు. గురువారం లక్ష్మీనర్సుపేటలో ప్రకృతి వ్యవసాయ సాగు విధానంలో పండ్ల తోటల్లో కూరగాయ పంట మొక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో భూ సారం కాపాడుకోవచ్చన్నారు. రసాయన ఎరువులు, పురుగుల మందుల అవశేషాల్లేని పంట దిగుబడులు సాధించవచ్చన్నారు. ఆరోగ్య కరమైన పంటకు మార్కెట్‌లో మంచి ఆదరణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బి.లలిత, సూర్యనారాయణ, పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

యాసిడ్ తాగి వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్: స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన అదాం హేమసుందర్(51) గురువారం యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. హేమసుందర్ గతంలో ఇంజనీరింగ్ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసేవా డు. కొద్ది నెలలుగా పనికి వెళ్లకుండా మద్యానికి బానిసయ్యాడు. నిత్యం తాగుతూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో బుధవారం మద్యం తాగి ఇంటికి వచ్చి ఇంకా తాగేందుకు డబ్బులు కావాలని భార్యను అడగ్గా తన వద్ద డబ్బులు లేవని ఆమె గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్థాపం చెందిన హేమసుందర్ శుక్రవారం ఇంట్లో బాత్ రూంలో వాడే యాసిడ్ తాగేశాడు. కుమారుడు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ హేమసుందర్ మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ట్లు ఎస్ఐ తెలిపారు.

పాతమేఘవరంలో చోరీ

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం మేఘవరం పంచాయతీ పాతమేఘవరం గ్రామానికి చెందిన సోములు అనే వ్యక్తి ఇంట్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఇంట్లో పడుకున్న సమయంలో కిటికీ ఇనుప చువ్వలు తొలగించి దుండగులు ప్రవేశించారని, 5 తులాల బంగారం, రూ.50వేలు నగదు చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ మధుసూదన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

• అయ్యప్పకు సహస్ర పుష్పాలంకరణ



పాత శ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న ధర్మశాస్తా ఆలయం 17వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అర్చకులు మావుడూరు బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో స్వామికి అష్టద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి సహస్ర పుష్పాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు లోకనాథం నందికేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

రైతే.. డ్రోన్ పైలట్..

- ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న అన్నదాతలు
- డ్రోన్ సేద్యంపై శిక్షణ
- పైలట్ ప్రాజెక్టుగా ముగ్గురికి ట్రైనింగ్ పూర్తి



డ్రోన్‌ద్వారా సూక్ష్మ ఎరువులను పిచికారీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: అన్నదాతలు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారు. సంప్రదాయ సేద్యానికి భిన్నంగా కాలానుగుణంగా వస్తున్న మార్పులకు తగ్గట్లు వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. కాడెద్దులు, నాగలి కాలం నుంచి ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, పవర్‌టిల్లర్, నాట్లు, కోత కోసే, పంటమార్పిడి యంత్రాల వినియోగంపై పట్టు సాధిస్తున్నారు. కూలీలు దొరక్క తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో తాజాగా డ్రోన్ కెమెరాల వాడకంపై శిక్షణ పూర్తి చేసుకొని వ్యవసాయ పనులను సులభంగా, వేగంగా చేసుకుంటున్నారు.

పైలట్ ప్రాజెక్టుగా ముగ్గురికి శిక్షణ..

శ్రీకాకుళం మండల పరిధిలోని తండేవలస గ్రామానికి చెందిన రైతు కుంచాల రాజశేఖర్, సానివాడ గ్రామానికి చెందిన ఉంగటి సాయి, సింగుపురం గ్రామానికి చెందిన కుంచాల సింహాచలంను ప్రభుత్వం డ్రోన్ పైలెట్స్ శిక్షణకు ఎంపిక చేసింది. గుంటూరులోని ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ క్షేత్రంలో వీరు ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరిద్వారా మండలంలోని పలువురు రైతులకు డ్రోన్ ద్వారా శిక్షణ ఇచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే శ్రీకాకుళంలోని డీసీసీబీ బ్యాంక్ ద్వారా రూ.10లక్షలు విలువ గల డ్రోన్‌ను ప్రభుత్వ రుణంపై తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇందులో ప్రభుత్వ సబ్సిడీ రూ.4 లక్షలు.

యంత్ర సేవా కేంద్రాలకు శ్రీకారం..

వ్యవసాయంలో డ్రోన్‌లను వినియోగించి అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. సకాలంలో పురుగుల మందులు, సూక్ష్మ ఎరువులను పంటలకు అందించేందుకు వ్యవసాయ డ్రోన్ పరికరాలను ఉపయోగించనున్నారు. మూడు రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఉత్సాహం కలిగిన ఐదారుగురు రైతులతో సంఘాలుగా ఏర్పడితే రూ.10లక్షల యూనిట్ గల డ్రోన్లను రాయితీపై అందిస్తారు.

మూడు డ్రోన్‌లను బుక్‌చేశాం..



శ్రీకాకుళం మండలానికి సంబంధించి మూడు డ్రోన్‌లు బుక్‌చేశాం. ముగ్గురు రైతులు ఇటీవల గుంటూరులో డ్రోన్ వినియోగంపై శిక్షణ తీసుకున్నారు. ఒక్కో డ్రోన్ ద్వారా పది ఎకరాల పంట పొలాలకు అన్ని రకాల మందులను పిచికారీ చేయవచ్చు.

– ఉషాకుమారి, వ్యవసాయాధికారి, శ్రీకాకుళం రూరల్ మండలం

డ్రోన్‌ల వినియోగంతో లాభాలెన్నో..

- పురుగుల మందు పిచికారీ చేసేందుకు పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు కూలీల సమస్య పరిష్కారమవుతుంది.
- పొలంలో మొక్కలన్నింటికీ సమతుల్యంగా మందును పిచికారీ చేయవచ్చు. దీని ద్వారా 25శాతం పురుగుల మందు వినియోగం తగ్గుతుంది.
- పురుగుల మందు పిచికారీ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, అనారోగ్యాల నుంచి బయటపడవచ్చు.
- మార్కెట్‌లో లభ్యమయ్యే పురుగుమందులన్నింటినీ డ్రోన్‌ల ద్వారా పిచికారీ చేయవచ్చు.
- డ్రోన్‌లతో విచక్షణారహితంగా పురుగుల మందు వినియోగం జరగదు కాబట్టి పర్యావరణానికి ఎటువంటి హాని ఉండదు.